# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, సోమవారం 26 ఆగస్టు 2024 | KAMAREDDY


## పుడమికి పచ్చల హారం

**వానకాలం** నాట్లు పూర్తవడంతో ఎక్కడ చూసినా పంట పొలాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. పల్లె శివారు ప్రాంతాలు పచ్చదనపు పరిమళాలు వెదజల్లుతున్నాయి. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం తిమ్మాపూర్, నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలోని నాగేంద్రపురం శివారులో కనుచూపు మేర పచ్చదనం పరుచుకున్నది. భూమికి పచ్చని హారం వేసినట్లు కనిపిస్తూ చూపరులకు ఆహ్లాదం పంచుతున్నది.


– కోటగిరి, ఆగస్టు 25


కోటగిరి మండలం నాగేంద్రపురం సమీపంలోని పంట పొలాలు


బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో పచ్చదనంతో కళకళలాడుతున్న పొలాలు

**ఉమ్మడి నిజామాబాద్** జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా కొనసాగుతున్న జూపల్లి కృష్ణారావు పత్తాలేకుండా పోయారు. ఇటువైపు పర్యటించేందుకు కూడా తీరిక చూసుకోవడం లేదు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో ఓసారి కామారెడ్డి పర్యటనకు వచ్చారు. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల సమయంలో పంట నష్టం పరిశీలనకు తప్పా మరోసారి ఇటువైపే కన్నెత్తి చూడలేదు. ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కుగా ఉండాల్సిన ఆయన.. శీతకన్ను ప్రదర్శిస్తున్నట్లు పలువురు తప్పు పడుతున్నారు. ఇప్పటికే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి మంత్రిగా ఎవ్వరికీ అవకాశం దక్కలేదు. సలహాదారు పదవిలో షబ్బీర్ అలీ ఉన్నప్పటికీ మంత్రి పదవి మాదిరిగా ప్రభావితం చేసే పరిస్థితి లేదు. దీంతో ఉభయ జిల్లాలో పరిపాలన గందరగోళంలో పడింది. మంత్రి లేని ఈ ప్రాంతానికి అడపాదడపా వచ్చి సమీక్షలు, సమావేశాలు చేయాల్సిన ఇన్‌చార్జి మంత్రి తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓవైపు ప్రభుత్వ పరంగా ఇబ్బందులు తలెత్తుతుండగా, మరోవైపు కాంగ్రెస్ పార్టీలోనూ అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

–నిజామాబాద్, ఆగస్టు 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి)




# అమాత్యా.. ఇటువైపు చూడండి..

- ఉమ్మడి జిల్లా ప్రగతిపై చిన్నచూపు
- చుట్టపు చూపునకే పరిమితమైన జూపల్లి
- ఎనిమిది నెలలైనా అభివృద్ధిపై దిశానిర్దేశం కరువు
- యంత్రాంగంలో లోపిస్తున్న బాధ్యత
- పరిష్కారాలకు రాజధానికి వెళ్తున్న ప్రజాప్రతినిధులు

**ఉమ్మడి** నిజామాబాద్ జిల్లాలో మొత్తం 9 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో నాలుగు చోట్ల కాంగ్రెస్ పార్టీ, రెండు చోట్ల బీఆర్ఎస్, మరో మూడు చోట్ల బీజేపీ గెలిచింది. ఆధిపత్యం పరంగా ఆయా పార్టీల బలాలు తీసిపోనట్లుగానే ఉన్నప్పటికీ ఈ మధ్యనే బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి కండువా మార్చారు. కాంగ్రెస్‌లో చేరి అధికార పార్టీలో కొనసాగుతున్నారు. ఇందులో కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలు ఆరుగురు ఉండగా సీనియర్ ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పని చేసిన పోచారం శ్రీనివాస రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి ఉన్నారు. నిధుల వినియోగంలో ఇబ్బందులు, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వంతో విన్నపాలు సమర్పణలో వీరంతా ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తున్నది.

రెండు జిల్లాల్లోనూ మంత్రిగా ఎవ్వరికీ బాధ్యతలు ఇవ్వకపోవడంతో నియోజకవర్గాల సమస్యలను ఇన్‌చార్జి మంత్రితోనే పంచుకుంటున్నారు. పేరుకు పోతున్న సమస్యలను వినతుల రూపంలో హైదరాబాద్‌కు వెళ్లి ఇచ్చేసి వస్తున్నారు. కాంగ్రెస్ మినహా ఇతర పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా సహకరించడం లేదు. ప్రోటోకాల్ ఉల్లంఘనలతోపాటు ప్రజల అవసరాలను తీర్చేందుకు ఆయా శాఖల అధికారులంతా అధికార పార్టీ నేతల మాటలనే వింటున్నారు. వీటన్నింటి పరిష్కారానికి జిల్లా అభివృద్ధిపై సమీక్షలు, సమావేశాలు జరగాల్సి ఉందంటూ ఎమ్మెల్యేలంతా కోరుకుంటున్నారు. దీంతో జిల్లా, నియోజకవర్గాలపై పట్టు రావడంతో ప్రజా అవసరాలను తీర్చేందుకు సంపూర్ణ అవగాహన వస్తుందని పలువురు భావిస్తున్నారు. కానీ ఇన్‌చార్జి మంత్రి మాత్రం చొరవ తీసుకున్నదే లేకపోవడంతో ఎమ్మెల్యేలంతా ఆగమాగం అవుతున్నారు. చిక్కుముడులు విప్పేందుకు జూపల్లి కృష్ణారావు ముందడుగు వేయకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి.

**ప్రాబల్యం తగ్గుతుందనే అడ్డుకుంటున్నారా?**

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఈ మధ్యనే ఓ సందిగ్ధత ఏర్పడింది. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌పై బీజేపీ కన్నెర్ర చేసింది. ఎస్‌డీఎఫ్ నిధులను ఇతర ప్రాంతాలకు తరలించడం మానుకోవాలంటూ వారంతా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం అంతా నగరపాలక సంస్థ పరిధిలోనే ఉన్నందున ఎస్‌డీఎఫ్ నిధులను నగరానికే ఖర్చు చేయాలంటూ కోరుతున్నారు. ఇలా మచ్చుకు ఎదురవుతున్న సమస్యలు అనేకం ఉన్నాయి. అధికార పార్టీ నేతలంతా తమకు ఇష్టమొచ్చినట్లుగా వ్యవహరిస్తుండడంతో బీఆర్ఎస్, బీజేపీ ప్రజాప్రతినిధులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లా ప్రగతి, అభివృద్ధిపై దిశానిర్దేశానికి ఇన్‌చార్జి మంత్రి చొరవ తీసుకొని, సమీక్ష సమావేశాలను నిర్వహించాలని ప్రతిపక్ష పార్టీతోపాటు అధికార పార్టీలోని నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇన్‌చార్జి మంత్రి రాకతో ఉభయ తారకమంత్రం మాదిరిగా ప్రభుత్వ యంత్రాంగంలో చలనం రావడంతోపాటు కాంగ్రెస్ పార్టీలోనూ చోటా, మోటా నాయకులకు తమ విన్నపాలను చెప్పుకునే వీలుంటుందని భావిస్తున్నారు. అయితే మంత్రి రాకను కొంతమంది నేతలు స్వాగతిస్తుండగా, కీలక నేతలు వ్యతిరేకిస్తుండడంతోనే ఈ సందిగ్ధత కొనసాగుతున్నట్లుగా తెలుస్తున్నది. మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న నేతలు సమయం ఇవ్వకపోవడం, ఇన్‌చార్జి మంత్రి రాకతో తమ ప్రాబల్యం తగ్గుతుందేమోనని భయం, ప్రభుత్వ యంత్రాంగంలో పట్టు పోతుందేమోనన్న ఆందోళనతో ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై సమీక్షలు నిర్వహించడం లేదన్న చర్చ జోరుగా సాగుతున్నది.


బాధిత కుటుంబం నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

# భూంపల్లిలో ఆరోగ్యశిబిరం

### గ్రామంలో పర్యటించిన డీఎంహెచ్‌వో

రామారెడ్డి, ఆగస్టు 25: జిల్లాలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. సదాశివనగర్ మండలంలోని భూంపల్లి గ్రామంలో ఇటీవల విష జ్వరంతో ఓ విద్యార్థి మృతిచెందగా.. శనివారం అదే గ్రామానికి చెందిన మరో బాలిక మృతి చెందింది. పదిరోజుల్లో ఇద్దరు మృతిచెందగా.. దీనిపై నమస్తే తెలంగాణ దినపత్రికలో ఆదివారం 'విషజ్వరాల పంజా..' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్ స్పందించారు. ఆదివారం భూంపల్లి గ్రామానికి చేరుకొని మృతి చెందిన బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి సోమవారం నుంచి వారంరోజులపాటు ఆరోగ్యశిబిరం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ అర్హత ఉన్న వైద్యులను సంప్రదించాలని, ఆర్ఎంపీల వద్దకు వెళ్లవద్దని సూచించారు. డీఎంహెచ్‌వో వెంట జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆస్మా, జలపతి,నాగరాజు, ఏఎన్ఎం లలిత తదితరులు ఉన్నారు.


పద్మాజివాడి ఎక్స్‌రోడ్డు వద్ద దవాఖానను సీజ్ చేసిన వైద్యాధికారులు

## ప్రైవేట్ దవాఖాన సీజ్

రామారెడ్డి, ఆగస్టు 25: సదాశివనగర్ మండలం పద్మాజివాడి ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న ఆర్ఎంపీ రాజిరెడ్డి నిర్వహిస్తున్న దవాఖానను డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ ఆదివారం సీజ్ చేశారు. సదరు ఆర్ఎంపీ ఇటీవల భూంపల్లి గ్రామానికి చెందిన చిన్నారులకు చికిత్స అందించిన నేపథ్యంలో దవాఖానలో తనిఖీలు చేశారు. హైడోస్ మందులు, స్టెరాయిడ్స్ కనిపించడంతో దవాఖానను సీజ్ చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే నిర్వహించాలని సూచించారు. ఫీవర్ కేసులను వెంటనే ప్రభుత్వ దవాఖానలకు పంపించాలన్నారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్సకు మించి ఎక్కువ వైద్యం చేసినట్లు నిర్ధారణ అయితే కేసులు నమోదుచేసి, చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## జ్వరంతో యువకుడి మృతి

### గ్రామంలో విషాదఛాయలు

రామారెడ్డి, ఆగస్టు 25: సదాశివనగర్ మండల కేంద్రానికి చెందిన చిలుక నరేశ్ (28) జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు. డెంగీతో మృతిచెందినట్లు స్థానికులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. సదాశివనగర్‌కు చెందిన నరేశ్ ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం స్వగ్రామానికి రాగా జ్వరం రావడంతో కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేరాడు. వైద్యుల సూచన మేరకు శనివారం హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందు తూ ఆదివారం మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకు న్నాయి. డెంగీతో మృతి చెందడంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.



## ఎస్సారెస్పీకి 34,952 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మోర్తాడ్, ఆగస్టు 25: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది.ప్రాజెక్ట్‌లోకి 34, 952 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు) కాగా, ఆదివారం ప్రాజెక్ట్‌లో 1083.2అడుగుల (54.292టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి 3,822 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది.



## కృష్ణం వందే జగద్గురుమ్

- నేడు కృష్ణాష్టమి వేడుకలు
- ఉమ్మడి జిల్లాలో ముస్తాబైన ఆలయాలు

## ఎనిమిది తరగతులకు ఇద్దరే టీచర్లు..


ఒకేచోట కూర్చున్న వివిధ తరగతుల విద్యార్థులు

రుద్రూర్, ఆగస్టు 25: రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి ఎనిమిది తరగతుల వరకు విద్యాబోధన జరుగుతున్నది. ఈ పాఠశాలలో సుమారు 80మంది విద్యార్థులు చదువుతుండగా పాఠాలు బోధించేందుకు మాత్రం ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారు. దీంతో ఎనిమిది తరగతుల విద్యార్థులను ఎలా క్రమశిక్షణలో పెట్టాలో అర్థం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం విద్యావలంటీర్లను నియమిస్తే విద్యాబోధనలో కృషి చేసేందుకు మంచి అవకాశం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. సరిపడా తరగతి గదులు, సౌకర్యాలు ఉన్నా చదువు చెప్పడానికి ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య మరింత తగ్గింది. ఈ విషయమై ఎంఈవో నాగ్‌నాథ్‌ను వివరణ కోరగా డీఎస్సీ ద్వారా పోస్టుల భర్తీ అయితేనే ఉపాధ్యాయుల కొరత తీరుతుందని, తక్కువగా ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపిస్తున్నట్లు చెప్పారు.


రామారెడ్డి మండలం రెడ్డిపేట్‌లో మున్నూరుకాపు సంఘ సభ్యుల మౌన ప్రదర్శన

## మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

### మున్నూరు కాపు కులస్తుల డిమాండ్
### పలు మండలాల్లో మౌనదీక్ష

మాచారెడ్డి/ మద్నూర్/రామారెడ్డి/భిక్కనూరు, ఆగస్టు 25 : మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, జనాభా ప్రతిపాదికన తమకు అన్ని రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని మున్నూరు కాపు కులస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండా ఎక్స్‌రోడ్ లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణతోపాటు మద్నూర్, భిక్కనూరు మండల కేంద్రాలు, రామారెడ్డి మండలం రెడ్డిపేట్ గ్రామంలో ఆదివారం మౌనదీక్ష చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపులకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. మున్నూరుకాపులకు రూ. 5వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. పౌల్ట్రీ, డెయిరీఫామ్ ఏర్పాటు కోసం సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని, నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమాల్లో మున్నూరు కాపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.